సాక్షి
విశాఖపట్నం
గురువారం । 11 । జనవరి । 2024



ఏయూలో ఆస్ట్రేలియన్ కార్నర్

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వెస్ట్రన్ ఆస్ట్రేలియన్ కార్నర్ బుధవారం ప్రారంభమైంది. 8లో



స్కేటర్ సాహితీకి ప్రోత్సాహం

రోలర్ స్కేటర్ సాహితీకి దివీస్ లేబొరేటరీ యాజమాన్యం బుధవారం రూ.3.85 లక్షల ప్రోత్సాహం అందించింది. 8లో



గురుపూజోత్సవాలకు ఏర్పాట్లు

విశాఖలో 63వ మాస్టర్ సీ.వీ.వీ.గురుపూజా ఉత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. 8లో

అధినేత దెబ్బ.. అయ్యన్న అబ్బా..

- కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ హుళక్కే..
- నర్సీపట్నానికే పరిమితమంటున్న బాబు
- ఈ సీటు కొడుక్కే ఇవ్వాలంటూ ఇంటి పోరు
- ఇప్పుడు బరిలోకి దింపకపోతే రాజకీయ వారసత్వం కష్టమేనని భావన
- ఇంటి పోరుతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో అయ్యన్న
- అధినేత తీరుపై అసహనంతో రగిలిపోతున్న వైనం



టీడీపీ సీట్ల చిత్రాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఒకవైపు అధినేత అనకాపల్లి ఎంపీ సీటు విషయంలో కొట్టిన దెబ్బకు కోలుకోలేక మధనపడుతున్న అయ్యన్నకు.. ఇంటి పోరు మరింత తలపోటుగా మారుతున్నట్టు తెలుస్తోంది. రాజకీయ వారసత్వంగా కొడుకును నర్సీపట్నం నుంచి 2024 ఎన్నికల్లో బరిలోకి దించాలంటూ ఒత్తిడి అధికం కావడంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో ఒకవేళ రానున్న ఎన్నికల్లో కొడుకును బరిలోకి దించకపోతే తన రాజకీయ వారసత్వం కష్టమనే భావనలో అయ్యన్న ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే ఇక అయ్యన్న నోటికి తాళం పడినట్టేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటు కోసం అయ్యన్న తీవ్రంగా కష్టపడ్డారు. నోటికి వచ్చినట్టు ఇష్టారీతిన అధికార వైఎస్సార్ సీపీపై విమర్శలు గుప్పించారు. అధినేత దృష్టిలో ఉంటూ అనకాపల్లి ఎంపీ సీటును కొడుకుకు వచ్చేలా యత్నించారు. అయితే, ఎన్నికలు వచ్చేసరికి వ్యాపారవేత్తలు, పైసలు ఉన్నవారికే సీటు ఇచ్చే అలవాటున్న చంద్రబాబు ఈసారి మారారనే భావనలో అయ్యన్న ఉన్నారు. తీరా ఎన్నికల ముంగిటకు వచ్చేసరికి యథావిధిగా అనకాపల్లి ఎంపీ సీటును బాగా ఖర్చు చేయగలిగిన వ్యక్తికి ఇవ్వనున్నట్టు సంకేతాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే రాజకీయ వారసత్వం కోసం నర్సీపట్నం నుంచి కొడుకును బరిలోకి దించాలంటూ ఇంటి పోరు రోజురోజుకీ ఎక్కువవుతున్నట్టు తెలుస్తోంది.

కొడుకు పోరుతో విలవిల

వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వకపోతే కుమారుడిని నర్సీపట్నం నుంచి బరిలోకి దించాలంటూ ఇంటి పోరు అధికమైనట్టు తెలుస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో నోటికి వచ్చినట్టు ఇష్టానుసారంగా మాట్లాడిన అయ్యన్న ఓటమి తర్వాతైనా గుణపాఠం నేర్చుకుంటారని అందరూ భావించారు. అయితే, అయ్యన్న బుద్ధి మాత్రం మారలేదు. సరికదా ఓటమి బాధలో మరింతగా దిగజారి మాట్లాడటం ప్రారంభించారు. ఫలితంగా నియోజకవర్గంలో అయ్యన్నకు ఏ మాత్రమూ పట్టుపెరగడం లేదు. మరోవైపు ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ వివాదరహితుడు కావడం... తాజాగా జరిగిన సాధికార యాత్ర విజయవంతం కావడం వల్ల మరోసారి వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కచ్చితంగా 2024 ఎన్నికల్లోనే కుమారుడిని బరిలోకి నిలిపేలా ఇంటి పోరు ఎక్కువవుతోందని సమాచారం. 2029 ఎన్నికల వరకూ వేచిచూడటం కష్టమంటూ కుమారుడికి మద్దతుగా అయ్యన్న సతీమణి కూడా గొంతు కలుపుతున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా అధినేత వైఖరితో తలబొప్పి కట్టిన అయ్యన్నకు... ఇంటి పోరు మరింత తలపోటుగా మారింది. కొడుకును బరిలోకి దింపి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించుకుంటారా లేదా అనేది త్వరలో తేలనుంది.

రాజకీయ వారసత్వం కష్టమే..

వాస్తవానికి ఏ రాజకీయ నాయకుడైనా తనకు ఆరోగ్యం, వయస్సు సహకరించిన సమయంలోనే తన వారసత్వాన్ని రాజకీయాల్లో దించటం సహజ పరిణామం. తీరా వయస్సు అయిపోయిన తర్వాత వారసత్వాన్ని రంగంలోకి దించితే గెలిపించడం కష్టంగా మారుతుంది. ఈ నేపథ్యంలోనే అనేక మంది రాజకీయ నాయకులు తమ వారసులను రంగంలోకి దించే ప్రయత్నం చేస్తారు. అయితే అయ్యన్న నర్సీపట్నంతో పాటు అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వాలని కోరుతున్నారు. చంద్రబాబు మాత్రం ఎప్పటికప్పుడు దీనిపై దాటవేస్తూ వస్తున్నారు. కొద్దిరోజుల ముందు భారీగా ఖర్చు చేసే అభ్యర్థి దొరకడంతో అనకాపల్లి ఎంపీ సీటు ఇవ్వలేమని తేల్చిచెప్పేశారు. దీంతో పార్టీ కోసం కష్టపడితే ఇదేనా నాకిచ్చే గౌరవమంటూ ఆయన లోలోపల మండిపడుతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇదే పరిస్థితుల్లో నర్సీపట్నం నుంచి తాను రంగంలోకి దిగితే వచ్చే ఎన్నికల వరకు అంటే 2029 వరకూ రాజకీయ వారసత్వం కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈసారి ఎన్నికల్లో గెలిచే సూచనలు కనిపించనప్పటికీ కొడుకును బరిలో నిలపడం ద్వారా రాజకీయ వారసత్వం కొనసాగించే అవకాశం ఉంటుంది.

రోడ్లపై భోగి మంటలు వేయొద్దు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : నగర ప్రజలు రోడ్లపై భోగి మంటలు వేయొద్దని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. పర్యావరణహితంగా హరిత భోగిని అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. భోగిమంటలు రోడ్లపై వేయడం వల్ల రోడ్లపై ఉన్న తారు కరిగి రోడ్లు పాడవుతాయని, మంటలు వల్ల రోడ్లపై గుంతలు ఏర్పడతాయని పేర్కొన్నారు. భోగి మంటలను బహిరంగ ప్రదేశాలు, మైదానం, ఖాళీ స్థలాల్లో వేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో వార్డు కార్పొరేటర్లు, స్వచ్ఛంద సంస్థలు, నివాసిత సంక్షేమ సంఘ సభ్యులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్లపై భోగిమంటలు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

12 వైద్య శిబిరాల్లో 5,212 మందికి సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం నగరంలో 12 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. పెదగంట్యాడ, తోటగరువు, ఆదర్శనగర్, భవానీగార్డెన్స్, దొండపర్తి-2, గాంధీజీ వీధి, జ్ఞానాపురం, కొబ్బరితోట, ముత్యాలమ్మతోట, ముత్యమాంబ కాలనీ, పెందుర్తి, రుషికొండ-2, సిద్దేశ్వరంలో నిర్వహించిన శిబిరాల్లో 5,212 మందికి వైద్య సేవలందించారు. ఇందులో 17 రిఫరల్ కేసులను వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు పంపారు. శిబిరాల్లో రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. బక్కన్నపాలెం, బాలాజీనగర్-2, గంగవరం, ఇందిరా కాలనీ, ఇసుకతోట, కొబ్బరితోట, నరసింహానగర్, రైల్వే న్యూకాలనీ, శ్రామికనగర్‌లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పరస్పర సహకారంతో పురోగతి



మాట్లాడుతున్న హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ హేమంత్ ఖత్రి

విశాఖ సిటీ: పరస్పర సహకారంతో అభివృద్ధికి బాటలు పడతాయని హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సీఎండీ హేమంత్ ఖత్రి అన్నారు. బుధవారం సుమారు 100 మంది వ్యాపార భాగస్వాములతో హెచ్‌ఎస్‌ఎల్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి కీలక ప్రాజెక్టుల సాధన దిశగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో వ్యాపార భాగస్వాముల సహకారంతో మరిన్ని ప్రాజెక్టులను చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

వీకే పీసీపీఐఆర్‌యూడీఏ చైర్మన్‌గా చొక్కాకుల



సీతమ్మధార: విశాఖ-కాకినాడ పెట్రోలియం కెమికల్ ఇన్వెస్టిమెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా చొక్కాకుల వెంకటరావును నియమించారు. ఈ మేరకు బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి ఈ సందర్భంగా చొక్కాకుల వెంకట్రావ్ కృతజ్ఞతలు తెలిపారు.

12న స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం మేయర్, చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 12న జరగనుంది. ఈ సమావేశంలో 38 అంశాలు చర్చకు రానున్నాయి. అనకాపల్లిలో జీవీఎంసీ గెస్ట్ హౌస్, సమావేశ మందిరం, కార్యాలయ చాంబర్ డిజైన్‌కు పరిపాలన ఆమోదం, ఏఎంసీ కాలనీలో ఎఫ్‌ఆర్‌పీ టాయిలెట్‌కు రెట్రో ఫిట్టింగ్ మరమ్మతులు, 35వ వార్డులోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం నిర్వహణ, సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపింగ్ వర్కర్స్, హార్టికల్చర్ వర్కర్స్, మెటీరియల్ కొనుగోలు, కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు సీ అండ్ డీ వ్యర్థాలు, గార్బేజ్, ట్రీ వేస్ట్‌ను 12 సీఎంటీ టిప్పర్ల ద్వారా తరలింపు తదితర అభివృద్ధి అంశాలు, ఉద్యోగుల సర్వీస్ అంశాలు సభ్యుల ముందు చర్చకు రానున్నాయి.

'లీడ్' చాంపియన్ ధ్రువిక ఆర్యనా



ఆర్యనాకు బహుమతి అందిస్తున్న సుమిత్

బీచ్‌రోడ్డు: ఎడ్‌టెక్ కంపెనీ నిర్వహించిన లీడ్ చాంపియన్‌షిప్ 2023 విజేతగా నగరానికి చెందిన ఎల్.ధ్రువిక ఆర్యనా నిలిచింది. బెంగుళూర్‌లో జరిగిన గ్రాండ్ ఫైనల్స్‌లో కమ్యూనికేషన్, క్రిటికల్ థింకింగ్ అంశాలపై నిర్వహించిన పోటీల్లో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 3 వేల మంది విద్యార్థులు పోటీపడగా.. ఆర్యనా విజయం సాధించింది. లీడ్ సంస్థ వ్యవస్థాపకుడు సుమిత్ మెహతా చేతులమీదుగా బహుమతి స్వీకరించింది.

పారదర్శకంగా కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ

మహారాణిపేట: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు స్పష్టం చేశారు. డబ్బులు తీసుకుంటున్నారనే వార్తలను నమ్మవద్దని, ఈ విషయంపై ఎలాంటి సమాచారం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు పారదర్శకంగా క్రమబద్ధీకరణ జరుగుతోందని.. ఉద్యోగులు ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని ఆయన సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్-18, ఫార్మసిస్టులు-14, ఆరోగ్య కార్యకర్తలు(పురుష)-278, మహిళలు-19 మంది సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

12న రైతుల ఎంపిక కోసం డ్రా

మహారాణిపేట : రైతు బజార్లలో కొత్త రైతులకు అవకాశం కల్పిస్తున్నామని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. తొమ్మిది రైతు బజార్లలోను రైతుల సంఖ్య పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు. మొత్తం 786 మంది జాబితా నుంచి 321 మంది రైతుల కోసం డ్రా తీస్తున్నామన్నారు. వివరాలకు 9959592474 లో సంప్రదించాలని కోరారు.

త్వరలోనే అరకు పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తాం



పార్టీ విశాఖ ఉత్తర నాయకులతో సమీక్ష చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

- సమన్వయకర్త నియామకంపై అభిప్రాయాలు సేకరిస్తాం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపే తమ లక్ష్యమని ఆ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో గాజువాక, విశాఖ ఉత్తర, భీమిలి, పెందుర్తి, అరకు నియోజకవర్గాల పార్టీ ముఖ్య నాయకులతో బుధవారం ఆయన సమావేశయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అరకు సమన్వయకర్త నియామకంపై అక్కడి కార్యకర్తల నుంచి కొన్ని అభిప్రాయాలు వచ్చాయన్నారు. త్వరలోనే అరకు పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తామన్నారు. అక్కడ పార్టీ శ్రేణుల అభిప్రాయాలను సేకరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి నివేదిస్తామన్నారు. నివేదిక పరిశీలన అనంతరం పార్టీ అధిష్టానం నిర్ణయం వెలువరిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల సమీక్ష

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి ఉరుకూటి చందు, విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజుల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో వైవీ సుబ్బారెడ్డి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు గురించి చర్చించారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు ముత్తంశెట్టి ప్రియాంక, కంటిపాము కామేశ్వరి, కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు ఇన్‌చార్జి నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

రండి.. నగరాభివృద్ధికి సహకరించండి!

- నగర ప్రజలకు జీవీఎంసీ రెవెన్యూ విభాగం వినూత్న విజ్ఞప్తి
- 2023-24లో ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లింపులపై ఇంటింటా ప్రచారం

సాక్షి, విశాఖపట్నం : 'నమస్తే.. విశాఖ వాసులారా.. మీరు చెల్లించే ఆస్తి పన్ను నగర అభివృద్ధికి కీలకం కానుంది. ఆర్థిక సంవత్సరం చివరి దశకు వస్తున్న తరుణంలో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా.. గడువులోగా పన్నులు చెల్లించి.. మహా విశాఖ నగరం అభివృద్ధికి బాటలు వెయ్యండి.' అంటూ మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) రెవెన్యూ విభాగం ప్రజలకు వినూత్న పద్ధతిలో విజ్ఞప్తి చేస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో నోటీసులతో పాటు ప్రజలకు పన్ను చెల్లింపు వల్ల కలిగే ప్రయోజనాల్ని వివరించేలా రెవెన్యూ సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పన్నుల వసూళ్ల లక్ష్యాల్ని చేరుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను ప్రైవేటు డిమాండ్ ప్రకారం రూ.427.22 కోట్లు టార్గెట్‌గా పెట్టుకున్నామని మహా విశాఖ నగర పాలక సంస్థ ప్రకటించింది. అదేవిధంగా నీటి చార్జీల విషయంలో రూ.87.62 కోట్లుగా నిర్దేశించుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో మూడు నెలల సమయం మాత్రమే ఉండటంతో జీవీఎంసీ రెవెన్యూ అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటి వరకూ వివిధ మార్గాల్లో కార్పొరేషన్ ఖజానాకు ఆస్తి పన్ను రూపంలో రూ.302.34 కోట్లు, నీటిపన్ను రూపంలో 15.05 కోట్లు వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మార్చి 31 ఆఖరి రోజు అయినప్పటికీ మార్చి 25 లోపు శతశాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలనే దృఢ నిశ్చయంతో జీవీఎంసీ రెవెన్యూ అధికారులు శ్రమిస్తున్నారు.



పీవోఎస్ యంత్రాల ద్వారా పన్ను చెల్లిస్తున్న ప్రజలు

జీవీఎంసీ పరిధిలో...

2023-24 ఆస్తిపన్ను లక్ష్యం
రూ.427.22 కోట్లు

జనవరి 9 వరకూ వసూలైన మొత్తం-
రూ.302.34 కోట్లు

ఇంకా వసూలు కావాల్సింది
రూ.124.89 కోట్లు

నీటి పన్ను వసూలు లక్ష్యం
రూ.87.62 కోట్లు

జనవరి 9 వరకూ వసూలైన మొత్తం-
రూ.15.05 కోట్లు

ఇంకా వసూలు కావాల్సింది-
రూ.72.58 కోట్లు

ప్రజలతో మమేకమై..

నూతన విధానాల్ని అవలంబిస్తూ ప్రజలతో మమేకమై పన్నులు రాబట్టుకోవాలని కమిషనర్ డా.సాయికాంత్ వర్మ మార్గదర్శకాల మేరకు డీసీఆర్ ఫణిరామ్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. చెల్లింపుల విషయంలో కొంతమంది మొండి బకాయిదారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో వారిపై అలసత్వం ప్రదర్శించకూడదని భావిస్తోంది. రెగ్యులర్ చెల్లింపుదారుల విషయంలో మాత్రం ప్రేమ పూర్వకంగా చెల్లింపులు చేసేలా రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకమవుతున్నారు. మొండి బకాయిదారులు మాత్రం నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించకపోతే కఠిన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడబోమని రెవెన్యూ సిబ్బంది తెగేసి చెబుతున్నారు.

పీవోఎస్‌ల ద్వారా చెల్లింపులు



కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ వసూళ్లపై పూర్తి స్థాయి దృష్టి సారించాం. జీవీఎంసీ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరం నుంచి బకాయిలు లేకుండా చర్యలు చేపట్టాలన్నదే లక్ష్యంగా భావిస్తున్నాం. జీవీఎంసీ పరిధిలోని 575 సచివాలయాల్లోని వార్డు అడ్మినిస్ట్రేటర్లకు పీవోఎస్ యంత్రాలు అందించాం. ప్రతి సచివాలయంలో ఉన్న పీవోఎస్‌లను ఉపయోగిస్తూ ప్రజలు పన్నులు చెల్లిస్తుండటం గొప్పవిషయం. నగర అభివృద్ధిని కాంక్షిస్తున్న ప్రజలంతా స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తున్నారు. మిగిలిన ప్రజలు కూడా వీలైనంత త్వరగా చెల్లించి నగరాభివృద్ధికి దోహద పడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మొండి బకాయిదారుల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరించాల్సి వస్తుంది. సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం.

– ఫణిరామ్, జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ)

జనంతో మమేకం

ఎంపీ ఎంవీవీ: ఏం చదువుతున్నావు తల్లీ.. అమ్మ ఒడి అందుతోందా?



విద్యార్థి జాహ్నవి: నేను 9వ తరగతి చదువుతున్నాను సార్. అమ్మ ఒడి వచ్చింది. జగన్ మామయ్య మా కోసం అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం, ట్యాబ్‌లు... ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పించారు. బాగా చదువుకుని ఐఏఎస్ అవ్వాలన్నదే నా లక్ష్యం.

ఎంపీ ఎంవీవీ: పింఛన్ వస్తోందా పెద్దాయనా?



పెద్దాయన: డిసెంబర్ వరకు రూ.2,750 పింఛన్ ఇచ్చారు. ఈ నెల నుంచి రూ.250 పెంచి రూ.3 వేలు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా పింఛన్ పెంచి మాట నిలబెట్టుకున్నారు. మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అయితేనే మాలాంటి వృద్ధులకు మంచి జరుగుతుంది. నా ఓటు వైఎస్సార్ సీపీకే అని జగన్ బాబుకు చెప్పండి.

ఇలా ప్రజలతో మమేకమవుతూ.. వారి కష్టాలను తెలుసుకుని భరోసా కల్పిస్తూ.. విశాఖ ఎంపీ, తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఉత్సాహంగా పాదయాత్ర సాగిస్తున్నారు. ప్రజలు, పార్టీ నాయకుల నుంచి ఆయనకు అడుగడుగునా అపూర్వ ఆదరణ లభిస్తోంది.



దర్జీకి బ్రోచర్ అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



రవీంద్రనగర్‌లో చిరు వ్యాపారులకు బ్రోచర్ అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

- ఎంపీ ఎంవీవీ పాదయాత్రకు అపూర్వ ఆదరణ
- 18వ రోజు ఉత్సాహంగా 8 కిలోమీటర్ల మేర నడక
- గడప గడపకు సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

సాక్షి, విశాఖపట్నం: ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేపట్టిన పాదయాత్ర(గడపగడపకు మన ప్రభుత్వం) 18 రోజులు పూర్తి చేసుకుంది. జీవీఎంసీ 10వ వార్డు 28వ, 26వ సచివాలయం పరిధిలో బుధవారం ఉదయం 7.30 గంటలకు పాదయాత్ర ప్రారంభించారు. ఎస్‌ఐజీ నగర్, రవీంద్ర నగర్, రామాలయ వీధిలో గడప గడపకూ వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. 900కు పైగా కుటుంబాలను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని అడిగి లబ్ధిదారులకు తెలియజేశారు.

ఎంపీ దృష్టికి స్థానిక సమస్యలు

ఎస్‌ఐజీ నగర్, శాంతి నగర్, రవీంద్ర నగర్, రామాలయ వీధిలో డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలు ఉన్నాయని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను మేయర్ గొలగాని హరివెంకటకుమారి దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని వారికి ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్, 21వ వార్డు ఇన్‌చార్జి మదపాటి రవికుమార్, ఎస్సీ సెల్ విశాఖ జోనల్, జిల్లా అధ్యక్షులు అల్లంపల్లి రాజుబాబు, బోని శివరామకృష్ణ, ముఖ్య నేతలు రామన్నపాత్రుడు, చొక్కర శేఖర్, బొండా శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు, అభిమానులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ 'సాక్షి'తో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టినట్లు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవం తీసుకొచ్చారని కొనియాడారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 18 రోజులుగా పాదయాత్ర చేస్తున్నానని.. ఏదో ఒక రూపంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందుతున్నామని ఇక్కడి ప్రజలు చెబుతుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉండకూడదని.. ఒకవేళ అలాంటి వారు ఉంటే వెంటనే వారితో దరఖాస్తు చేయించాలని వలంటీర్లకు సూచించానన్నారు.

ప్రజలంతా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారని, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు.

జగదల్‌పూర్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: కొత్తవలస-కిరండూల్ లైన్ పరిధి దంతేవాడ-కమ్లూర్ సెక్షన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదించినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ గురువారం జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. గురు, శుక్రవారాల్లో కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ గురువారం జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. గురు, శుక్రవారాల్లో కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ జగదల్‌పూర్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయి. 10 గంటలకు రెండో స్థాయీ సంఘం, 10.30కు 5, 12కు 4, 6, మధ్యాహ్నం 3 గంటలకు 1, 3, 7వ స్థాయీ సంఘం సమావేశాలు జరుగుతాయి. సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు అధికారులను ఆదేశించారు.

ఏయూలో వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్



వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్‌ను ప్రారంభిస్తున్న వీసీ సమత, జెన్నిఫర్ హోవెల్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్ బుధవారం ప్రారంభమైంది. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రో చాన్సలర్ జెన్నిఫర్ హోవెల్ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య కె.సమత మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం వంటి వసతులను కలిగి ఉందన్నారు. ఏయూలో 58 దేశాలకు చెందిన 1,084 మంది విదేశీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. వీరికి అవసరమైన హాస్టళ్లు, వసతులను కల్పించామన్నారు. సుందర నగరం విశాఖ పర్యాటకులకు స్వర్గధామంగా ఉందన్నారు. జెన్నిఫర్ హోవెల్ మాట్లాడుతూ విభిన్న రంగాల్లో ఏయూతో కలిసి పని చేస్తామన్నారు. రెండు వర్సిటీలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్.. ఏయూలో నిర్వహిస్తున్న కోర్సులు, వసతులు, విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు తదితర అంశాలను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఏయూలో సమర్థంగా నిర్వహిస్తున్న అమెరికన్ కార్నర్ పనితీరు, నిర్వహించిన కార్యక్రమాలపై మాట్లాడారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొని రెండు వర్సిటీల ప్రతినిధులను అభినందించారు. గవర్నమెంట్ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషనర్(ఇండియా–గల్ఫ్) నషీద్ చౌదరి, ఎడ్యుకేషన్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆంటోని జోసెఫ్, ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.కె భట్టి, వి.విజయలక్ష్మి వై.రాజేంద్రప్రసాద్, ఏ.నరసింహారావు, జి.శశిభూషణరావు, ఆచార్య టి.శోభశ్రీ, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

12న పట్టాభిషేకం

- హౌస్ కమిటీ లబ్ధిదారులకు పట్టాల పంపిణీ
- గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: గాజువాక ప్రజలకు సంక్రాంతి పండగ ముందే వచ్చిందని, హౌస్ కమిటీలో ఉన్న లబ్ధిదారులకు ఈ నెల 12న పట్టాలు పంపిణీ చేయనున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చెప్పారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించామని తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీకి రంగం సిద్ధం చేశామన్నారు. ఈ నెల 12న గిరిజాకాలనీ వద్ద గల శివాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో సుమారు 7 వేలకు పైగా ఉన్న లబ్ధిదారులకు వీటిని అందజేయనున్నామని వివరించారు. గాజువాక హౌస్ కమిటీలో 66, 67, 70వ వార్డులు పూర్తిగా, 65, 74, 73, 72వ వార్డుల్లో కొన్ని ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. కర్ణవాని పాలెం హౌస్ కమిటీ, ఏపీఐఐసీ నిర్వాసితులకు కూడా ఇక్కడే పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, డైరెక్టర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరికి విశిష్ట సాహిత్య పురస్కారం



మంగళగిరి ప్రసాదరావు

మహారాణిపేట: సాహితీవేత్త మంగళగిరి ప్రసాదరావు సాహిత్య అకాడమీ తరఫున విశిష్ట సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఏలూరు జిల్లాలో గురువారం జరిగే సాహిత్య సంక్రాంతి సంబరాల్లో ఈ పురస్కారం స్వీకరించాలని ఆయనకు రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిలగోల్ల శ్రీలక్ష్మి ఆహ్వానం పంపారు. ప్రసాదరావు 2017లో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ నుంచి గుర్రం జాషువా సాహిత్య పురస్కారం, 2018లో అదే సంస్థ నుంచి గిడుగు రామ్మూర్తి విశిష్ట భాషా పురస్కారం, 2019లో బుల్లయ్య కాలేజీలో ఫెలోషిప్ అవార్డు, 2019లో ఢిల్లీలో మహాత్మా జ్యోతిబా పూలే సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు.

స్కేటర్ సాహితీకి రూ.3.85లక్షల ప్రోత్సాహం

తగరపువలస: రోలర్ స్కేటింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న సాహితీకి దివీస్ లేబొరేటరీ యాజమాన్యం బుధవారం రూ.3.85 లక్షలు అందించింది. సంస్థ వైస్ ప్రెసిడెంట్ సురెడ్డి దేవేందర్, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ఆమెకు ఈ మొత్తం చెక్కును అందించారు. భవిష్యత్‌లో సాహితీ మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. మిగిలిన క్రీడాకారులను కూడా సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు. ఎలక్ట్రికల్ విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆలపాటి ఆనంద్, సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, కె.నరసింహ, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్ పెద్ద మనసు

- దుబాయ్ నుంచి ఇందిరానగర్ వాసి మృతదేహం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు
- విమాన చార్జీలను భరించిన వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త

మల్కాపురం: ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. పైగా ఆయన వీసా గడువు ముగిసింది. అక్కడి నుంచి మృతదేహాన్ని ఇక్కడకు తీసుకొచ్చేందుకు అతని కుటుంబ సభ్యులకు తలకుమించి భారమైంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్ మానవత్వం చూపించారు. అతని మృతదేహం తీసుకొచ్చే ఏర్పాట్లు చేయడంతో పాటు అందుకయ్యే విమాన చార్జీలను భరించారు. వివరాలివీ.. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీకి చెందిన కొయ్య అప్పలస్వామి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఇటీవల అనారోగ్యంతో అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే అతని పర్మిట్ వీసా గడువు ముగిసింది. దీంతో మృతదేహాన్ని ఇక్కడకు తీసుకురాలేని పరిస్థితి నెలకొంది. అతని కుటుంబ సభ్యులు కార్పొరేటర్ పి.వి.సురేష్, వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్ ద్వారా వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణకు ఈ విషయం చెప్పారు. ఆయన ఢిల్లీలోని ఎంబసీ అధికారులతో మాట్లాడారు. దీంతో అప్పలస్వామి మృతదేహం బుధవారం ఇక్కడకు తీసుకురాగా.. కుటుంబసభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. దుబాయ్ నుంచి మృతదేహం తీసుకొచ్చేందుకు అయిన విమాన చార్జీలను కూడా ఆడారి ఆనంద్‌కుమార్ చెల్లించి పెద్ద మనసు చాటుకున్నారు. ఆయనకు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

అంబేడ్కర్ జీవిత విశేషాలపై లఘు చిత్రాల ప్రదర్శన



చిత్ర ప్రదర్శన తిలకిస్తున్న ప్రేక్షకులు

సీతంపేట: జన్ భాగీధారి పేరిట జిల్లాలో నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాలు రెండవ రోజూ ఉత్సాహంగా సాగాయి. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవిత విశేషాలను వివరిస్తూ.. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం లఘుచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శించిన లఘు చిత్రాలు, ఛాయా చిత్రాలను ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. రెండవ రోజు పలువురు దాతలు రక్తదానం చేశారు. ఇక్కడ ప్రదర్శించిన లఘుచిత్రాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉత్తమ చిత్రానికి ముఖ్యమంత్రి చేతులమీదుగా నగదు బహుమతి అందజేయనున్నారు. డీపీవో శ్రీనివాసరావు, డీఎల్డీవో పూర్ణిమాదేవి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపూజా ఉత్సవాలు

మహారాణిపేట : విశాఖలో 63వ మాస్టర్ సీ.వీ.వీ. గురుపూజా ఉత్సవాలను ఈనెల 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు జగద్గురుపీఠం కార్యనిర్వాహక సభ్యుడు చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. జిల్లా పరిషత్ సమీపంలో గల అంకోశ ఫంక్షన్ హాలులో జగద్గురుపీఠం జరపనున్న ఈ ఉత్సవాలకు సుమారు 2 వేల మంది సాధకులు దేశం నలుమూలల నుంచి పాల్గొంటున్నారని చెప్పారు. భారతీయ సంప్రదాయ పరిరక్షణకు, ఆధునిక యుగంలో ఆధ్యాత్మిక జీవన విధానాన్ని పెంపొందింపజేయడానికి, సమాజంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడానికి గురుపూజలు ఉపకరిస్తుంటాయని జగద్గురుపీఠం డైరెక్టర్ అజ్జరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. గురుపూజ ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా విశ్రాంత చీఫ్ ఇన్‌కం టాక్స్ కమిషనర్ ఎం.నరసింహప్ప, 30 మంది జగద్గురు పీఠం ప్రాంతీయ గణపతులు పాల్గొంటారన్నారు.

విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ మోసాలెన్నో..

డాక్టర్ గొలగాని అశోక్‌కుమార్ ఆరోపణ

దాబాగార్డెన్స్: విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ రాయవలస తిరుమలరావు.. కేకే బీకే ఎంటర్‌ప్రైజెస్ అధినేత కొర్ల కృష్ణ సాయంతో వైట్ కాలర్ మోసాలకు పాల్పడుతున్నారని డాక్టర్ గొలగాని అశోక్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.60 కోట్ల డిపాజిట్లున్నాయని కస్టమర్లను నమ్మించి కొర్ల కృష్ణ మోసాలు చేసేందుకు అవకాశం కల్పించారన్నారు. అర్ధ రూపాయి వడ్డీకే రూ.కోట్ల రుణాలు ఇస్తామని నమ్మిస్తూ తప్పుడు అగ్రిమెంట్లు చేసి.. లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. తిరుమలరావు.. బ్యాంకులో తనకున్న పరపతిని దుర్వినియోగం చేస్తున్నాడని.. హైదరాబాద్‌లో ఐడీబీఐ మహిళా బ్యాంక్ మేనేజర్ పేరును వాడుతూ మోసాలకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు.

ఈ విషయమై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అలాగే కేశినేని రమేష్(నవీన్) హెచ్ఆర్ఎం ఆటో సేల్స్, సత్యనారాయణ థియేటర్ దగ్గర, నూజివీడులో కార్యాలయాన్ని తెరిచి కొత్త పద్ధతిలో వైట్ కాలర్ నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి సమీపంలోని కురజాడను తీసుకుని అభివృద్ధి చేస్తున్నానని చెప్పుకుంటూ మోసగిస్తున్నాడన్నారు. గురుపీఠం భూ కుంభకోణం, ఎస్‌బీఐ అధికారిక స్టాంపులు తయారు చేసి నకిలీ చలాన్ల తయారీ తదితర మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. దీనిపై సీబీసీఐడీ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వెలమ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయింపు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన సభ్యులు



సమావేశంలో పాల్గొన్న వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: వెలమ సంక్షేమ సంఘానికి ప్రభుత్వం 75 సెంట్ల భూమి కేటాయించడం పట్ల ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చుక్కా చినబాబు, కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సీతమ్మధారలోని వెలమ భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వాన్ని అభినందిస్తూ తీర్మానం చేశారు. వెలమ సంఘం పెద్దలు, మంత్రులు బూడి ముత్యాలనాయుడు, ధర్మాన ప్రసాదరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థల సేకరణ కమిటీ సభ్యులు చుక్క చినబాబు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, చొక్కాకుల వెంకటరావు, యర్ర సన్యాసినాయుడు, అల్లు శంకరావు, బండారు రామకృష్ణ, మిడతాన బాపునాయుడు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లా క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జిల్లా క్రాస్ కంట్రీ మెన్, వుమెన్ బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా తరఫున మెన్ విభాగం 10 కిలోమీటర్ల రేస్‌లో వేదవ్యాస్, విశాల్ అభిషేక్, వి.రమేష్ పాల్గొనుండగా వుమెన్ విభాగంలో స్వరూప, మేరీగ్రేస్, రామలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొనున్నారు. బాలుర అండర్ 20 ఎనిమిది కిలోమీటర్ల రేస్‌లో డి.రవి, కిరణ్‌కుమార్, నరేంద్ర, బాలికల విభాగంలో పుష్ప, రేణుక, డి.పుష్ప పాల్గొనున్నారు. అండర్ 18 బాలికల నాలుగు కిలోమీటర్ల రేస్‌లో బి.హసిత పాల్గొనుంది. విశాఖ జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. వీరంతా నేషనల్ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ లో పాల్గొనుండగా పోటీలు బీహార్‌లోని గయలో ఈనెల 16న జరగనున్నాయి.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



బేడా ప్రదక్షిణ చేస్తున్న ఎంపీలు రెజ్వీర్ సింగ్, కిషన్ కపూర్ తదితరులు



అప్పన్న సన్నిధిలో మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఎంపీలు రెజ్వీర్ సింగ్, కిషన్ కపూర్, ఐఏఎస్ అధికారి ఆర్.కె.సూర్యనారాయణ, ఎంటీపీ అండ్ఎస్‌జీ డైరెక్టర్‌లు దీపిక, కుల్మోహన్ సింగ్ అరోరా దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపికలను, శేషవస్త్రాలను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న మాజీ ఐఏఎస్, ఐపీస్ అధికారులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం మాజీ ఐఏఎస్ అధికారులు శైలజా చంద్ర, రమేష్‌చంద్ర, ఐపీఎస్ అధికారి ఆర్.కక్కర్ స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి స్వామి వారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించవద్దు

విశాఖ విద్య: సంక్రాంతి సెలవుల్లో పాఠశాలలు, కాలేజీల్లో తరగతులను నిర్వహించడానికి వీల్లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. పాఠశాలలు ఈ నెల18 వరకు, జూనియర్ కాలేజీలకు ఈ నెల 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినందున విద్యార్థులను విద్యాలయాలకు పిలిపించవద్దన్నారు. నిబంధనలు పాటించని విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.

అప్పికొండ తీరంలో అస్థిపంజరం కలకలం



అస్థిపంజరం

కూర్మన్నపాలెం : దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి. అప్పికొండ సముద్ర తీరంలో బుధవారం అస్థిపంజరం లభ్యం కావడం కలకలం రేపుతుంది. పెదగంట్యాడ మండలం నమ్మిదొడ్డి సమీపంలోని అప్పికొండ సముద్ర తీరప్రాంతంలో గుర్తు తెలియని అస్థిపంజరం బయటపడడంతో అక్కడికి వచ్చిన పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని దువ్వాడ పోలీసులకు సమాచారం అందించారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని అస్థిపంజరాన్ని పరిశీలించారు. ఫోరెన్సిక్ పరీక్షల కోసం అస్థిపంజరాన్ని కేజీహెచ్‌కు తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఊరంతా ఉల్లాసం... ఇంటింటా ఆనందం



కొత్త దుస్తుల కొనుగోళ్లతో హడావిడిగా ఉన్న పల్లె జనం

- సొంతూళ్లకు తరలివస్తున్న వలస జనం
- సందడితో పులకించి పోతున్న పల్లెలు



ఆనందంగా తమ స్వగ్రామాలకు వస్తున్న వలస కూలీలు

చోడవరం: సంక్రాంతి పండగ రావడంతో పల్లెలన్నీ జనంతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే పాఠశాలలు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులంతా తమ స్వగ్రామాలకు వచ్చేశారు. వివిధ పనుల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిన కూలీలు కూడా వారి సొంతూళ్లకు చేరుకుంటున్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల మండలాల నుంచి ఏటా వందలాది మంది కూలీలు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఒంగోలు, నెల్లూరు జిల్లాలకు వరి కోతలు, ఇతర కూలి పనులకు వెళ్లి నెలల తరబడి అక్కడే ఉంటారు. మరికొందరు చెన్నై, కోల్‌కత్తా, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు రోజువారీ కూలిపనులకు వెళతారు. వీరంతా పిల్లలను, వృద్ధులను స్వగ్రామాల్లో వదిలేసి ఏడాదంతా అక్కడ పనులు చేసి నగదు సమకూర్చుకుని సంక్రాంతి నాటికి తమ సొంత ఊళ్లకు చేరుకుంటారు. ఎక్కడెక్కడికో జీవనోపాధికోసం వెళ్లిన వారంతా ఇప్పుడు గ్రామాలకు చేరడంతో పల్లెలన్నీ జనంతో ఎంతో సందడిగా ఉన్నాయి.

నెలల తరబడి ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన తమ బిడ్డలు ఇప్పుడు ఇళ్లకు రావడంతో ఆ కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయి. ఏ ఇంటిలో చూసినా ఆనందం తాండవిస్తోంది. ఈ ప్రాంతం వలస కూలీలంతా రైళ్లలో వచ్చి అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో దిగడంతో స్టేషన్ కూడా జనంతో కిటకిటలాడింది. ఇక పరిసర ప్రాంతాలకు వెళ్లే వారితో చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్, ఆటో స్టాండ్‌లన్నీ రద్దీగా ఉన్నాయి. పట్టణాలకు, షాపింగ్ మాల్స్‌కు దూరంగా ఉన్న చిన్నచిన్న పల్లెటూర్లలో దుస్తులు అమ్మేవారి సందడి మొదలైంది.



ఆటోలపై సామాన్లతో వస్తున్న కూలీలు

నేత్రపర్వంగా ధనుర్మాసోత్సవాలు



కొంకోట: కశింకోటలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం ఉదయం 'కూడారై' ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 27వ రోజున గోదాదేవిని వివాహం చేసుకునేందుకు రంగనాథుడు అంగీకారం తెలిపిన రోజును కూడారై ఉత్సవంగా ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బెల్లం, పంచదారతో వేర్వేరుగా పాయసాలు తయారు చేసి స్వామికి నివేదిస్తామన్నారు. ఆలయంలో విష్ణు సహస్ర నామార్చన, తిరుప్పావై, పాశుర విన్నపం పఠనం నిర్వహిస్తామన్నారు. పాయసాన్ని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తామని చెప్పారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,950
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,700
వెండి(కిలో):	రూ.77,700

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.90
స్కిన్	: రూ.150
స్కిన్‌లెస్	: రూ.160

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	599.00
విజయనగరం	603.00
శ్రీకాకుళం	603.00